ముక్కోటికి సర్వం సిద్ధం

- నేడు ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన తంటికొండ వెంకన్న ఆలయం

గోకవరం/కిర్లంపూడి: ముక్కోటి ఏకాదశి వేడుకలకు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని తంటికొండలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామికి ప్రత్యేక అభిషేకాలు, 4 గంటల నుంచి ఉత్తరద్వార దర్శనం కల్పించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ప్రసాద వితరణతో పాటు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నట్టు దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర తెలిపారు. అలాగే గుమ్మళ్లదొడ్డిలో శ్రీరామగిరి కొండపై కోదండరామ సహిత సత్యనారాయణ స్వామి ఆలయం, వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కిర్లంపూడి మండలంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. చిల్లంగి, సోమవరం గ్రామాల్లోని వేంకటేశ్వర ఆలయాలు, ఉత్తర ద్వారాలను గురువారం పూలతో సుందరంగా అలంకరించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పాఠశాలల్లో సంక్రాంతి


ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్‌లో భోగి మంట వేస్తున్న దృశ్యం


పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

- వైభవంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు
- వేషధారణలతో ఆకట్టుకున్న విద్యార్థులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గంగిరెద్దులు, భోగి మంటలు, రంగవల్లుల వంటి సంప్రదాయ పోటీలు నిర్వహించారు. రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల సిబ్బందికి దాత ఎం.గంగయమ్మ నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్‌వీవీ సత్యనారాయణ, బద్ది లోవరాజు, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

రౌతులపూడి: ములగపూడిలోని ప్రాథమిక పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. భోగి మంట వేసి సంక్రాంతి పండగకు ఆహ్వానం పలికారు. హరిదాసు, గంగిరెద్దులు, జంగమదేవర, ఎరుకులవారి చోధి వంటి వేషధారణలలో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తమరాన సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో చిన్నారుల తల్లులు, గర్భిణులు, బాలింతలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జేవీఆర్ రమేష్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఎం బి.ప్రశాంతి, ఈఓపీఆర్డీ, తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. గంగిరెద్దులు, హరిదాసు, ఎడ్ల బండ్లు, కోడి పుంజులు, గొబ్బెమ్మలు, రంగవల్లులు ఏర్పాటు చేశారు. ఆయా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ, హెచ్‌ఎం కె.రాజమోహన్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుంకర హైమావతి తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక సత్యనారాయణ స్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా వేసిన భోగి మంటలు ఆకట్టుకున్నాయి. పిల్లలకు గాలి పటాలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పైల రాణాప్రతాప్ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక మినర్వా విద్యాసంస్థల ఆవరణలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు భోగిమంట వేసి భోగిపండ్లు పోశారు. పిరమిడ్, కరాటే, సాంస్కృతిక ప్రదర్శనలు, బొమ్మలకొలువు, ఆకట్టుకున్నాయి. హరిదాసు, కొమ్మదాసు, సోదమ్మ తదితర వేషధారణలతో చిన్నారులు అలరించారు. విద్యార్థులు సాంస్కృతిక, జానపద కళలను ప్రదర్శించారు. రంగవల్లుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మినర్వా వ్యవస్థాపకుడు డీవీఎస్ రమేష్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక విజ్ఞాన భారతీ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో విద్యార్థులు భోగి మంటలు వేశారు. ముగ్గుల పోటీలతో పాటు సంప్రదాయ వేషధారణలతో అలరించారు.

శంఖవరం: మండలంలోని మండపం సత్యభారతి స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలు, ఆట, ఆటలతో అలరించారు. పాఠశాల ప్రాంగణంలో భోగిమంట, రంగవల్లులు, పూరి గుడిసెలు, ఎద్దుల బండి, కోడి పుంజులు, ఆలయ గోపురం శ్రీకృష్ణుడు, హరిదాసు, డూడూ బసవన్నల వేషధారణలు వంటి సంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు సందేశాత్మక నాటకాలను ప్రదర్శించారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన తోట రాంజీ


మాజీ సీఎం జగన్‌తో తోట రాంజీ

జగ్గంపేట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం తనయుడు రాంజీ గురువారం కలిశారు. తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసులో జగన్‌ను కలసి నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులను వివరించారు.

బకాయిలు విడుదల చేయాలి

ప్రత్తిపాడు: ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని విశ్రాంత మండల విద్యాశాఖాధికారి ముక్కు సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో గురువారం మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు మంజూరు చేయాల్సిన డీఏ, పీఆర్సీ, జీపీఎఫ్ బకాయిలు త్వరగా మంజూరు చేయాలని కోరారు. కొత్త పీఆర్సీ కమిషన్ నియమించే ముందుగానే మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ నాయకులు అవసరాల శేషగిరిరావు, సుబ్రహ్మణ్యం, జంధ్యం సుబ్బారావు, బాదంపూడి సూర్యనారాయణ, బర్రే కోటేశ్వరరావు, యలమంచిలి రామం పాల్గొన్నారు.

రబీ సాగుకు నీరు విడుదల


సుబ్బారెడ్డి సాగర్ జలాలను విడుదల చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: సుబ్బారెడ్డి సాగర్ మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ప్రతిఎకరాకూ సాగు నీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు ప్రాజెక్టు అధ్యక్షుడు ఇళ్ల అప్పారావు తెలిపారు. మండలంలోని ఇ.గోకవరంలో సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టును గురువారం ఆయన ఇరిగేషన్ అధికారులు, ఇతర సాగునీటి సంఘాల అధ్యక్షులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సహకారంతో ప్రాజెక్టు ఆధునీకరణతో పాటు కాలువలను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి దాళ్వా, అపరాల సాగుకు సాగర్ జలాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈఈ ఇబ్రహీం, ఉపాధ్యక్షుడు దేవ రాజబాబు, సర్పంచ్ మంతిన వెంకటరమణ, వనపర్తి నాగేశ్వరరావు, సాగునీటి సంఘాల అధ్యక్షులు దో నూకరాజు, దిడ్డి సుబ్బారావు, చెలంకూరి వెంకటేశ్వరావు, దేవ రాజబాబు, లొండ లోవరాజు, కుండల అప్పారావు, నిమ్మల రాంబాబు, జువ్విన తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యువజనోత్సవాలు

ఆదిత్య యూనివర్సిటీలో ముందుగానే సంక్రాంతి శోభ



కలర్స్-2025ను ప్రారంభిస్తున్న యూనివర్సిటీ ప్రో చాన్సలర్

గండేపల్లి: రంగు రంగుల ఫ్యాషన్ వస్త్రాలంకరణలు, విద్యార్థులకు దీటుగా అధ్యాపకులు ఉత్సాహంగా గడిపేందుకు ఆదిత్య యూనివర్సిటీ వేదికగా నిలిచింది. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కలర్స్ 2025 పేరిట నిర్వహిస్తున్న యూత్ ఫెస్ట్ కార్యక్రమం గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. విద్యార్థుల నృత్యాలు, కేరింతలు, జెయింట్ వీల్, కొలంబస్, స్టాల్స్, వినోద భరితమైన సాంస్కృతిక కార్యక్రమాలతో ముందుగానే సంక్రాంతి శోభను తలపించింది. మూడు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమం మొదటి రోజు యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎస్ సతీష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. జ్యోతి వెలిగించి బెలూన్స్ ఎగరవేసి యువజన ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల విరామానికి స్వస్తి పలికి విద్యార్థుల ఉత్సాహానికి వారి కోరిక మేరకు ఈ ఏడాది కలర్స్‌ను ప్రారంభించామన్నారు. స్పోర్ట్స్, గేమ్స్, సాంస్కృతిక విభాగాలలో పాల్గొనేందుకు 67 కళాశాలల నుంచి ఇప్పటికే 2,000 మంది విద్యార్థులు రిజిస్టర్ అయ్యారన్నారు. సుమారు 50,000 మంది విద్యార్థులు పాల్గొంటారని అంచనా వేస్తున్నామన్నారు. సెక్యూరిటీ సిబ్బంది, సీసీ కెమెరాలు, టీమ్స్ పర్యవేక్షణ, రవాణా సౌకర్యాలు, భోజన వసతులు సమకూర్చినట్టు తెలియజేశారు. కార్యక్రమంలో సినీ హీరో నిఖిల్ పాల్గొని సందడి చేశారు. జేఎన్టీయూకే రెక్టార్ కేవీ రమణారావు, ఐక్వద్రా ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఎల్‌ఎల్సీ ఫౌండర్, వైస్ ప్రెసిడెంట్ వెంకట్ మాచవోలు, యూనవర్సిటీ ఉపకులపతి ఎంబీ శ్రీనివాస్, డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్

తుని: విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశామని తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, కోటనందూరు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. గురువారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కోటనందూరు సెంటర్లో వాహనాలను తనిఖీ చేస్తుండగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించామన్నారు. బాపట్ల జిల్లాకు చెందిన మరిప్రోలు నాగేంద్రరెడ్డి, కుంచాల చిరంజీవి ప్రయాణిస్తున్న వాహనంలో 24.32 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ప్రాంతంలో రూ.48 వేలతో గంజాయిని కొనుగోలు చేసి బాపట్లకు తరలిస్తున్నట్టు నిందితులు చెప్పారన్నారు. కారు సీజ్ చేయడంతో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.నాలుగు వేల నగదు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకూ పోరాటం

తుని: దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఎస్సీవర్గీకరణ జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కొండేపూడి శ్యాంబాబు మాదిగ స్పష్టం చేశారు. గురువారం తునిలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గొల్ల అప్పారావు సెంటర్లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు వర్గీకరణ ఊసెత్తడం లేదన్నారు. వచ్చే నెల 7న నిర్వహించే లక్ష డప్పులు, వేయి గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరుగుల మోషే, పెదపూడి గవరయ్య, డి.అజయ్‌బాబు, మణికుమార్, తుమ్మలపల్లి కుమార్, గంపల బాబూరావు, అబ్బులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

గోకవరం: మండలంలోని రైతులందరూ రబీ సీజన్‌కు సంబంధించి ఈ-పంట విధిగా నమోదు చేసుకోవాలని గోకవరం ఏఓ రాజరాజేశ్వరి, కోరుకొండ హెచ్‌ఓ రిని సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఈ-పంట నమోదును గురువారం వారు పరిశీలించారు. వరి, మొక్కజొన్న సాగు వివరాలను ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ, ఉద్యానవన శాఖ సహాయకులకు తెలియచేసి ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ పంట నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందుతాయని తెలిపారు.

తాండ్ర పాపారాయుడు విగ్రహం ఆవిష్కరణ


వెలమ కొత్తూరులో తాండ్ర పాపారాయుడు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

తుని రూరల్: మండలంలోని వెలమకొత్తూరులో తాండ్ర పాపారాయుడు విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. పోతల రమణ సౌజన్యంతో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు ఆవిష్కరించారు. బొబ్బిలి ఎమ్మెల్యే అనివార్య కారణాలతో విగ్రహం ఆవిష్కరణకు హాజరు కాలేదని నాయకులు పరవాడ తాతబాబు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దుంగల నాగేశ్వరరావు, బోజంకి వెంకటరమణ, కర్రి ఏడుకొండలు, కిల్లి సన్యాసిరావు, గొల్లు దివాణం, రొంగల అప్పాజీ, సిరిపురం శ్రీనివాసు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శంఖవరం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు గురువారం తెలిపారు. విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో బెల్ట్ షాపు నిర్వాహకుడిపై ఎక్సైజ్ అధికారులు గురువారం కేసు నమోదు చేశారు. గ్రామంలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎక్సైజ్ ఎక్సైజ్ ఎస్సై చౌదరి తన సిబ్బందితో దాడి చేశారు. ఐదు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

రౌతులపూడి: స్థానిక సీహెచ్‌సీలో గురువారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి జానకీదేవీ ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం పలు ఆరోగ్య సూచనలు చేశారు. గర్భిణులకు ఆసుపత్రి స్టాఫ్ నర్స్ సుజాత నళిని సింగ్ ఆర్థిక సహకారంతో మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రిలోని వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముద్రగడ నాయకత్వంలో నడిచేందుకు సిద్ధం


కిర్లంపూడిలో ముద్రగడను కలసిన ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం నాయకత్వంలో నడిచేందుకు మేమంతా సిద్ధంగా ఉన్నామని సీనియర్ నేత, రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ కాకరపల్లి వీరంశెట్టి అన్నారు. ఏలేశ్వరం మండలం జడ్డంగి అన్నవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం, ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్డంగిఅన్నవరం ప్రజలతో తనకున్న అనుబంధాన్ని ముద్రగడ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ నియోజకర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలను త్వరలో కలుస్తానన్నారు. పార్టీ బలోపేతానికి మనమందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గొల్లపల్లి కాశీవిశ్వనాథం, కొండపల్లి బాబీ, కోరాడ శ్రీను, కొమ్మర్తి బాబ్జీ, శొంఠియానం కృష్ణ, కమలబత్తుల లోవరాజు, అప్పన, జిగటాపు రాజు, పసల ఉప్మాకస్వామి తదితరులు పాల్గొన్నారు

తూర్పులక్ష్మీపురంలో బాలల సభ

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురంలో గురువారం బాలల సభ నిర్వహించారు. 2025–26 గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా స్థానిక ఎంపీపీ స్కూల్ బాలల సభ జరిగింది. సర్పంచ్ వీరంరెడ్డి సత్యరాణినాగ భార్గవి అధ్యక్షతన జరిగిన సభలో ఆర్థిక సంవత్సర ప్రణాళిక తయారీతో పాటు విద్యార్థులకు కావల్సిన అవసరాలను తెలుసుకోవడం, కిశోర వికాసం, బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధం, పోక్సో చట్టం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టవలసిన అంశాలపై చర్చించినట్టు తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇజనగిరి శివప్రసాద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

గోకవరం: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఉపాధి హామీ పథకం అంబుడ్స్‌మెన్ షేక్ ఖాదర్‌బాషా గురువారం పరిశీలించారు. అచ్యుతాపురం గ్రామంలో రాతి చెరువు, తంటికొండలోని నరసయ్య చెరువులో జరుగుతున్న పనులను, స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలోని ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్, రంపయర్రంపాలెంలో పంచాయతీ పరిధిలోని ఫీడర్ కాలువ, మినీ గోకులం, కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని కెనాల్ ప్లాంటేషన్, ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్ పనులను ఆయన తనిఖీ చేశారు. పనులకు హాజరైన వేతనదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు రూ.300 వేతనం వచ్చే విధంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ శేషఅప్పలరాజు, ఇతర సిబ్బంది ఉన్నారు.

వృద్ధులకు ఆహార పొట్లాల పంపిణీ

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో చికిత్స పొందుతున్న గర్భిణులు, వృద్ధులకు గురువారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. మండలంలోని శరభవరం ఏజెన్సీ మిషనరీకి చెందిన అల్లు సామ్యూల్ వీటిని అందజేశారు. అలాగే సీహెచ్‌సీ సమీపంలోని నిరుపేదలకు సైతం ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటిండెంట్ డాక్టర్ బి.సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విజయానికి ఓటమి తొలిమెట్టు


కబడ్డీ పోటీల విజేత ప్రత్తిపాడు జట్టుకు షీల్డ్, నగదు బహుమతిని అందిస్తున్న సీఐ సూర్య అప్పారావు

ప్రత్తిపాడు: ఓటమి విజయానికి తొలిమెట్టు అని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కబడ్డీ పోటీలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. ముగింపు సభలో సీఐ సూర్య అప్పారావు మాట్లాడుతూ పండుగ రోజుల్లో జూదక్రీడల జోలికి పోవద్దని హితవు పలికారు. అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొంటే దండన తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ పోటీల్లో ప్రత్తిపాడు జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. గజ్జనపూడి, రాచపల్లి జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుచుకున్నాయి. విజేతలకు బహుమతులను సీఐ బి.సూర్య అప్పారావు అందజేశారు. ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం, విశ్రాంత ఏఎంవీఐ మిద్దెం చిన్నారావు, తొగర చిన్నారావు, ఫిజికల్ డైరెక్టర్ దేవీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి పరికరాల వితరణ

తుని రూరల్: మండలంలోని తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ అవేర్ గ్రూప్ పరికరాలను బహూకరించింది. గురువారం ఆస్పత్రిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సర్పంచ్ అత్తి నాగరాజు వీటిని డాక్టర్ పి.సాహితీకి అందజేశారు. టేబుల్, మూడు కుర్చీలు, రిఫ్రిజిరేటర్, స్ట్రక్చర్, వేయింగ్ మిషన్ అందజేశారు.

సిటీ కేబుల్ ఎండీకి ముద్రగడ పరామర్శ


త్రిమూర్తిస్వామి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముద్రగడ పద్మనాభం

తుని రూరల్: పుత్ర వియోగంతో బాధపడుతున్న సిటీ కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తిస్వామిని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం గురువారం పరామర్శించారు. ఎస్.అన్నవరంలో త్రిమూర్తిస్వామి నివాసానికి వెళ్లిన ముద్రగడ ఆయనను పరామర్శించి, కుటుంబ సభ్యలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. హేమ శంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరిశే శివగణేష్, రాపేటి పెద్ద, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం


జి.కొత్తపల్లిలో దగ్ధమైన తాటాకిల్లు

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గురువారం తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన అడ్డాల నూకరాజు ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి ఇల్లు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడింది. ఈ ప్రమాదంలో రూ.50 వేలు ఆస్తినష్టం వాటిల్లింది. సంఘటన స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.



• అభివృద్ధిలో దూసుకుపోతున్న తుని పట్టణం
• ఏజెన్సీకి ముఖద్వారంగా తుని మార్కెట్
• శరవేగంగా విస్తరించిన కార్పొరేట్ వ్యాపారం
• బులియన్ మార్కెట్‌కు కేరాఫ్ • అందుబాటులో కార్పొరేట్ వైద్య సేవలు

ప్రగతి పథంలో పయనం

తుని: ఏజెన్సీకి ముఖద్వారం తుని పట్టణం. బంగారం వ్యాపారానికి పెట్టింది పేరు. విద్య, వైద్య, వస్త్ర, రైల్వే ఎగుమతులు, మామిడి, జీడి పప్పు తదితర రంగాల్లో దూసుకుపోతుంది. రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజన సమయంలో మార్పులు లేవు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తునికి ప్రత్యేక ఉంది. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఏ కార్యక్రమమైనా తూర్పు సెంటిమెంట్‌తో తుని నుంచి శ్రీకారం చుడతాయి. రాజకీయంగా తునికి ప్రత్యేకత ఉంది. గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న తుని పట్టణంలో షాపింగ్ మాల్స్ రావడంతో వ్యాపార రంగం విస్తరించింది. కార్పొరేట్ సంస్థలకు చెందిన బంగారం షాపింగ్ మాల్స్ అందుబాటులో ఉండడంతో బులియన్ మార్కెట్‌లో అగ్రగామిగా నిలిచింది.

ప్రముఖ పట్టణాలకు దీటుగా..

కాకినాడ, రాజమహేంద్రవరం పట్టణాలకు దీటుగా తుని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతోంది. ప్రముఖ కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపారాన్ని తునికి విస్తరించాయి. బల్క్ డ్రగ్ పరిశ్రమలు, పోర్టు తదితర పారిశ్రామిక రంగాల విస్తరణతో తుని పట్టణంలో శరవేగంగా రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందింది. వైద్య పరంగా 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

తుని పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్లు, మోడల్ పార్కులు, మెయిన్ రోడ్డు విస్తరణ, రైల్వే అండర్ పాస్ తదితర అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. తుని రైల్వేస్టేషన్ నుంచి కేంద్ర, రాష్ట్ర రాజధానులకు రైళ్ల సదుపాయం ఉంది. తొండంగి మండలం పెరుమాళ్లపురం బెల్లం గారులకు ప్రసిద్ధి. పలువురు మాజీ సీఎంలు, మంత్రులు బెల్లం గారుల రుచిని చూచి అదిరిందని కితాబు ఇచ్చారు.


తుని పట్టణం ఏరియల్ వ్యూ

నమ్మకానికి వన్నె తెచ్చిన దాడిశెట్టి

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా తుని బులియన్ మార్కెట్‌కు ప్రసిద్ధి. ఇందుకు ఆద్యుడుగా దాడిశెట్టి నరసయ్య నిలిచారు. ఆరు దశాబ్దాలుగా దాడిశెట్టి కుటుంబం బంగారు వ్యాపారంలో తనదైన ముద్ర వేసింది. దాడిశెట్టి నరసయ్య కుమారుడు విష్ణుచక్రం ఆయన కుమారుడు నరసయ్య ధనలక్ష్మి జ్యూయలరీ షోరూం ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ప్రజల మన్ననలు పొందారు. దీంతో పాటు విష్ణుచక్రం రెండో కుమారుడు శ్రీనివాస్ మరో బంగారు షోరూం ఏర్పాటు చేస్తున్నారు. తుని పరిసర ప్రాంతాల ప్రజలకు దాడిశెట్టి నరసయ్య అంటేనే బ్రాండ్. తునిలోని ధనలక్ష్మి జ్యూయలరీ షోరూంలో అందమైన అభరణాలు అందుబాటు ధరలో లభిస్తున్నాయి. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగణంగా అభరణాలు అందుబాటులోకి తీసుకువచ్చామని నరసయ్య తెలిపారు.



గ్రామీణ ప్రజలకు అత్యాధునిక నేత్ర వైద్య సేవలు

పెదపూడి: అనపర్తి నారాయణరెడ్డి కంటి ఆస్పత్రిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన రోబోటిక్ లేజర్ లాసిక్ శస్త్రచికిత్స అందుబాటులో ఉందని నేత్ర వైద్య నిపుణుడు తేతలి సత్యనారాయణరెడ్డి తెలిపారు. అనపర్తి, పరిసర గ్రామాల ప్రజలకు 50 ఏళ్లుగా కంటి వైద్యం అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆధునిక పరికరాలతో, అత్యాధునిక సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. తేతలి సత్యనారాయణరెడ్డి తనయుడు డాక్టర్ వెంకటరామిరెడ్డి, కోడలు డాక్టర్ సంధ్యారెడ్డి కంటి వైద్యంలో ఎప్పటికప్పుడు ఆధునిక పరిజ్ఞానాన్ని సామాన్యులకు అందుబాటులో తీసుకువస్తున్నారన్నారు.

సంతాన సాఫల్యం సులభతరం

కాకినాడ క్రైం: ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని రాజమహేంద్రవరం, కాకినాడ నగరాల్లో లండన్ ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ చంద్రారెడ్డి తెలిపారు. 2015లో విశాఖపట్నంలో తొలి బ్రాంచ్ ప్రారంభించినట్లు చెప్పారు. సంతానోత్పత్తి చికిత్సలో విశేష సేవలందిస్తోందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత జెనోమిక్ ఫెర్టిలిటీ అనాలసిస్ టెక్నాలజీని లండన్ ఐవీఎఫ్ అందిపుచ్చుకుందన్నారు. జీనీఫెమినా, జీనీ యాండ్రో అనే అధునాతన సాంకేతిక ప్రక్రియల ద్వారా పురుషులతో పాటు మహిళల్లోనూ వంధ్యత నివారణకు చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. జీన్ టెక్, జీఎఫ్ఏ టెక్నాలజీల సాయంతో జీనీఫెమినా, జీనియాండ్రో చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. యూకేలో శిక్షణ పొందిన వైద్య నిపుణులను ఈ చికిత్సల కోసం వినియోగిస్తున్నామన్నారు. పునరుత్పత్తి వైఫల్యాలను కనుగొనేందుకు చేసిన కృషికి గాను టైమ్స్ గ్రూప్ ద్వారా ఏపీ బెస్ట్ అవార్డును అందుకున్నామని చెప్పారు. జీన్‌టెక్ వ్యవస్థాపకులు, చీఫ్ సైన్స్ అధికారి డాక్టర్ అనురాధా ఉడుముడి పునరుత్పత్తి చికిత్సా విధానాలలో సాంకేతికతను జోడించేందుకు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.





120 ఏళ్లుగా వైద్య సేవల్లో సీఎంసీ ఆస్పత్రి

పిఠాపురం: పిఠాపురం పట్టణంలో 120 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తోన్న సీఎంసీ హాస్పటల్ ఎంతో ఘన చరిత్ర కలిగి ఉంది. అనుభవం కలిగిన డాక్టర్ల పర్యవేక్షణలో అధునాతన వైద్య పరికరాలతో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తూ ఈ ప్రాంత ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్నామని సీఎంసీ హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అమృత లాల్ తెలిపారు. స్త్రీల వైద్య, ప్రసూతి సేవలు, కంటి వైద్య సేవలు, ఎముకలు, ఊపిరితిత్తులు, చర్మ, గుండె, నరాల వ్యాధులతో వస్తోన్న రోగులకు అనుభవం కలిగిన వైద్యులతో సేవలు అందిస్తున్నామని చెప్పారు. లేప్రో స్కోపిక్ ద్వారా కోత లేకుండా ఆపరేషన్ చేస్తున్నట్టు డాక్టర్ అమృత్‌లాల్ పేర్కొన్నారు. ఈ ఆస్పత్రిలో వైద్యసేవల కోసం వచ్చేవారికి అందుబాటులో రుచి శుభ్రతతో కూడిన ఆహారం అందించే కేంటిన్ సదుపాయం కూడా ఏర్పాటు చేశామన్నారు.





విస్తృత వైద్య సేవల్లో ఎంఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

పిఠాపురం: పిఠాపురం పట్టణంలో 2019 నుంచి వైద్య సేవలను అందిస్తూ, ఎంఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ప్రజలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించే లక్ష్యంతో పనిచేస్తోంది. ఆసుపత్రి ఆర్థోపెడిక్స్, రుమటాలజీ, రీజెనరేటివ్ మెడిసిన్ వంటి వైద్య సేవల్లో ప్రత్యేకత కలిగి ఉంది. ఈ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ తొలి గుర్తింపు పొందిన ఆర్థోపెడిక్ రుమటాలజిస్ట్ డాక్టర్ జి.సురేష్. ఆయన లక్నోలోని రామ్ మనోహర్ లోహియా విశ్వవిద్యాలయం నుంచి ఆర్థోపెడిక్ రుమటాలజీ, రీజెనరేటివ్ ఆర్థ్రో బయాలజిక్స్‌లో ఫెలోషిప్ పొందారు. ఆయన రూపకల్పన చేసిన ప్రొలోజోన్, అగ్మెంటెడ్ ప్రొలోజోన్ ట్రీట్మెంట్స్ ఆస్టియోఆర్థిటిస్ మోకాళ్ల చికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. డాక్టర్ సురేష్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పురస్కారాలను అందుకున్నారు. డాక్టర్ మంజుషా సాలాడి, ఆసుపత్రి మేనేజింగ్ పార్టనర్, గైనకాలజీ, ప్రసూతి విభాగానికి అధిపతిగా ఉన్నారు. మినిమల్ ఇన్వేసివ్ సర్జరీలు, హై-రిస్క్ ప్రెగ్నెన్సీలను విజయవంతంగా నిర్వహించడంలో ఆమె అనుభవజ్ఞురాలు. ఎంఎస్ ఆసుపత్రి స్థాయి-2 ఐసీయూ సేవలను ప్రారంభించి ప్రజలకు విశేష సేవలందిస్తున్నారు. ఈ ఆసుపత్రి అనేక క్లిష్టమైన వైద్య కేసులను విజయవంతంగా పరిష్కరించి, ప్రజల నమ్మకాన్ని చూరగొంది.



సుజుకీ వారి బంపర్ ఆఫర్స్

సుజుకీ ఆథరైజ్డ్ డీలర్ కంటిపూడి సుజుకీ సంక్రాంతి సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేకమైన లక్కీ డ్రా ఆఫర్ల సౌకర్యం కల్పించింది. మొదటి బహుమతిగా మారుతీ సుజుకీ ఫ్రాంక్స్ కారు, రెండో బహుమతిగా అయిదుగురికి సుజుకీ జిక్సర్ ఎస్ఎఫ్ 250 బైక్, మూడో బహుమతిగా 15 మందికి సుజుకీ జిక్సర్ 250 బైక్స్, నాలుగో బహుమతిగా 20 మందికి ఆపిల్ ఐ ఫోన్ (15, 128 జీబీ)ను ప్రకటించారు.



రియల్ ఎస్టేట్ రంగంలో శ్రీనివాస హవా

పాయకరావుపేట: రియల్ ఎస్టేట్ రంగంలో శ్రీనివాస రియల్ ఎస్టేట్ దినదినాభివృద్ధి చెందుతోంది. మధ్య తరగతి కుటుంబాలకు, ఉద్యోగులకు తక్కువ ధరకే, సులభమైన వాయిదా పద్ధతిలో ఇళ్ల స్థలాలు పొందే అవకాశం కల్పిస్తోంది. 1998లో విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ప్రారంభించిన శ్రీనివాస రియల్ ఎస్టేట్ వెంచర్స్ షణ్ముఖ గార్డెన్స్ విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లోనూ విస్తరించింది. ఇప్పటి వరకు 25 వెంచర్లు వేసి సుమారు 15 వేల మందికి ప్లాట్‌లు అందించిందని సంస్థ మేనేజింగ్ పార్టనర్ పన్నీరు బాబ్జీ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా నక్కపల్లిలో శంకుస్థాపన చేసిన బల్క్ డ్రగ్ పార్క్, మెట్ట అండ్ నిస్సాన్ స్టీల్ ప్లాంట్‌కు అతి చేరువులో కొత్తగా 26వ వెంచర్ వేశామని ఆయన చెప్పారు.

